క్లుప్తంగా

గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సినేషన్



టీకాలు వేస్తున్న ఆరోగ్య కార్యదర్శి తార

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ సచివాలయంలో బుధవారం గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఆరోగ్య కార్యదర్శి తార ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలో ముందుగా నమోదు చేసిన వివరాల మేరకు ఆశ కార్యకర్తలు గర్భిణులు, చిన్నారులను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యదర్శి తార మాట్లాడుతూ సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించిన శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ కాలనీలో జరిగిన అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని బుధవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు వాసుదేవరావు ఇంట్లో మంగళవారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ఇళ్ల వారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. విషయం తెలుసుకున్న శ్రీధర్ స్థానిక అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వాసుదేవరావు ఇటీవలే విదేశీ పర్యటనకు వెళ్లారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు వ్యాపించి, సామగ్రి అంతా కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు. దీనిపై తగిన విచారణ జరిపి, పూర్తి నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

ఏటీఆర్ ట్రస్ట్ పింఛన్ల పంపిణీ



కొత్తపాలెంలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందిస్తున్న అయితంశెట్టి గోపాలకృష్ణ

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ అందించే పింఛన్లను 89వ వార్డు కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో పలువురికి బుధవారం క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా సాంకేతిక కారణాల వల్ల పెన్షన్ రాని వారికి ఆడారి ఆనంద్‌కుమార్ ఆడారి తులసీరావు(ఏటీఆర్) చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అంజేస్తున్నారని తెలిపారు. ఈ వార్డులో కొత్తగా 12 మందికి రూ.2,750 చొప్పున అందించారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ తులసి, పాలమరశెట్టి విజయ్, ఆడారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత



గర్భిణులకు సరకులు అందిస్తున్న పత్నిరావు

సింథియా: జీవీఎంసీ 60వ వార్డు పరిధి అశోక్ నగర్ అంగవాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు బుధవారం వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి శరగడం పత్నిరావు సరకులు అందజేశారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేసి పిల్లల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పత్నిరావు మాట్లాడుతూ సీఎం జగన్‌హన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారిపోయాయన్నారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందించే పౌష్టికాహారం విషయంలో రాజీ పడకుండా నాణ్యమైన పదార్థాలు సరఫరా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, సచివాలయ కన్వీనర్లు కామాక్షి, సుబ్బలక్ష్మి, ఉమా, రాజేశ్వరి, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శివారు.. అభివృద్ధి జోరు



ఇది కదా అభివృద్ధి

నాడు

మట్టి రోడ్లు.. ఎక్కడికక్కడే వీధుల్లో మురుగు.. డ్రైనేజీలు లేక పోవడంతో జనావాసాల మధ్యే వాడుక నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లేది. రోడ్లపై నడవలేని స్థితి. చిన్న వర్షానికే నీరు నిలిచిపోయి రోడ్లు దుర్గంధభరితంగా ఉండేవి. కల్వర్టులపై పలకలు శిథిలమై వాహనాల రాకపోకలకు అవస్థలు పడేవారు.

నేడు

ప్రభుత్వం అన్ని వార్డుల్లో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసింది. జీవీఎంసీ ప్రత్యేక దృష్టి సారించింది. మట్టి రోడ్లపై సీసీ రోడ్లు వేశారు. వీధి రోడ్లు అభివృద్ధి చేసి అవసరమైన చోట కల్వర్టులు నిర్మించారు. మురుగుపారేందుకు వీలుగా డ్రైన్లు, కల్వర్టులు వేశారు. దీంతో వార్డు ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



చంద్రానగర్‌లో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు

- 89వ వార్డులో రూ.7.65 కోట్లతో అభివృద్ధి పనులు
- రహదారులు, కాలువల నిర్మాణం
- మారిన పలు ప్రాంతాల రూపురేఖలు

గోపాలపట్నం: టీడీపీ ప్రభుత్వ పాలనలో 89వ వార్డులో అభివృద్ధి శూన్యం. నేడు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను ప్రగతి బాట పట్టించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల పాటు కరోనా వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అభివృద్ధి పనులకు వెనుకంజ వేయలేదని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించిన తర్వాత వార్డులో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి.

61 పనులు.. రూ.6.85 కోట్ల వ్యయం

వార్డులో మొత్తం 61 పనులకు గాను రూ.6.85కోట్లు మంజూరయ్యాయి. వీటిలో 4.50 కోట్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు జరుగుతున్నాయి. ఇదే వార్డులో భీమిలి నియోజకవర్గం పరిధిలోని ప్రాంతాల్లో 15 పనులకు రూ.3.75కోట్లు పనులు మంజూరు కాగా రూ. 3.15 కోట్ల పనులు పూర్తయ్యాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు విన్నవించిన పనులు పూర్తి చేశారు. మరి కొన్ని ప్రగతిలో ఉన్నాయి. ఈ పనులు చూసిన స్థానికులు గతంలో ఇంత అభివృద్ధి చూడలేదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



చంద్రానగర్‌లో అభివృద్ధి చేసిన కాలువలు

89వ వార్డులో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు

సంవత్సరం	ఖర్చు చేసిన నిధులు
2019–20	రూ.73.80 లక్షలు
2020–21	రూ.84.15 లక్షలు
2021–22	రూ.78.93 లక్షలు
2022–23	రూ.38.03 లక్షలు

రోడ్లు బాగు పడ్డాయి



మా వీధి రోడ్లు బాగు పడ్డాయి. చాలా ఏళ్ల నుంచి అధ్వానంగా ఉన్న రోడ్లు ఇపుడు సిమెంట్ రోడ్లుగా మారాయి. ఇదంతా జగనన్న ప్రభుత్వం వల్లే సాధ్యపడింది. ఇప్పుడు వర్షాలు వచ్చినా బెంగలేదు. వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతుంది.

–గౌరి, కొత్తపాలెం

మా వార్డుకు మహర్దశ



మా వార్డుకు మహర్దశ పట్టింది. ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్న ఆస్ప్రతి వచ్చింది. కొత్త రోడ్లు వేశారు. వీధుల్లో కాల్వలు సీసీ రోడ్లు వేస్తున్నారు. దీంతో మా ఇబ్బందులు చాలా వరకు తీరాయి. ఐదేళ్ల కిందటకు.. ఇప్పుడు మా వార్డులోని చాలా ప్రాంతాల రూపు రేఖలు మారాయి.

–అమ్మాజీ, కొత్తపాలెం

అభివృద్ధి దిశగా పరుగులు



89వ వార్డు అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. రెండు నియోజక వర్గాల పరిధిలో ఉండడంతో ఎక్కువ నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి చేస్తున్నాం. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు పశ్చిమ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్ కుమార్‌తో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇటీవల సుమారు రూ.2 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇవి కూడా త్వరలోనే పూర్తవుతాయి.

– అయితంశెట్టి గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు

ఇంటికి వెళ్లడానికి ఇబ్బంది పడే వాళ్లం



మా వీధిలో ఇరుకు రోడ్లు... మా ఇటింకి వెళ్లాలంటే ఇబ్బందులు పడేవాళ్లం. మురుగు నీరు, రాళ్లు తేలిన రోడ్డు ఉండేది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మా ప్రాంతానికి వచ్చిన నాయకుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లాం. వారు స్పందించి సీసీ రోడ్లు వేశారు. చాలా బాగుంది. ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ఫాతిమా, చంద్రానగర్

కూలిన రెండిళ్లు



59వ వార్డులో వర్షానికి కూలిన ఇల్లు



61వ వార్డులో వర్షాలకు కూలిన పెంకుటిల్లు

సింథియా: జీవీఎంసీ 61వ వార్డు రజక వీధిలో రాము అనే నిరుపేదకు చెందిన పెంకుటిల్లు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నేలకూలింది. 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆదేశాల మేరకు వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దాడి సత్యనారాయణ(డిపో), గాంధీజీవీధి సచివాలయ సెక్రటరీ సత్యనారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. విషయాన్ని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

59వ వార్డులో..

జీవీఎంసీ 59వ వార్డు ములగాడ మండలం ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీలోని అన్సర్‌అలీ ఇల్లు కింద ఉన్న మట్టి జారిపోయి ఇల్లు నేలకూలింది. కొండవాలు ప్రాంతం కావడంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మట్టి జారి పోతుండడంతో అందులో నివసిస్తున్న వారంతా సురక్షితంగా ప్రాంతాలకు తరలివెళ్లారు. దీంతో బుధవారం ఉదయం ఒక్కసారిగా మట్టి దిబ్బలు జారి ఇల్లు నేలకూలింది. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

రహదారులు జలమయం



కొత్తపాలెం-నరవ రోడ్డులో వర్షపు నీరు

గోపాలపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల రోడ్లపైకి నీరు చేరింది. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జీవీఎంసీ 89వ వార్డు నరవ రహదారిలో వర్షపు నీరు చెరువును తలపించింది. రోడ్డుపై ప్రవహించే నీరును మళ్లించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. గతంలో తవ్విన కాలువల్లో పూడికలను తొలగించారు. కొత్తపాలెంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు. ఈ పనులను జీవీఎంసీ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు పర్యవేక్షించి గ్యాంగ్ వర్క్ చేయించారు. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తొలగించాలని, నిర్లక్ష్యం వహించవద్దని వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు.



నరవ రహదారి కాలువలో పూడిక తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

యుద్ధప్రాతిపదికన పూడికల తొలగింపు

ముమ్మరంగా సహాయక చర్యలు

విశాఖ విద్య: తుపాను ప్రభావంతో బుధవారం కూడా భారీ వర్షం కురిసింది. దీంతో వరద నీరు సజావుగా పారేందుకు వీలుగా మరో పక్క జీవీఎంసీ అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. జీవీఎంసీ 52,90వ వార్డుల్లో పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేశారు. రహదారులపై నిలిచిన వర్షపు నీటిని కాలువల్లోకి పంపించేలా తగిన చర్యలు తీసుకున్నారు. జోన్-8 అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణం రాజు బుచ్చిరాజుపాలెం పరిసర కాలనీల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సిబ్బందిని అప్రమత్తం చేశారు.



కొత్తపాలెంలో పూడికల తొలగింపును పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్య నాయుడు



సహాయక చర్యలను పరిశీలిస్తున్న డాక్టర్ కృష్ణంరాజు



ఎన్ఏడీ సెంటర్‌లో కురుస్తున్న వర్షం

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, బీఎస్ కృష్ణ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



రవాణా శాఖా కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న డీటీసీ రాజారత్నం, ఆర్టీవో శ్రీనివాసరావు



62వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

విశాఖ విద్య: అంబేడ్కర్ ఆశయాల సాధనకు పునరంకితమవ్వాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం శాంతినగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్. కృష్ణతో కలసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అంబేడ్కర్ యావత్తు దేశానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు శ్రీదేవి వర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు జియ్యాని మారుతీ , శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- బీజేపీ పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ బుచ్చిరాజుపాలెం కూడలిలోని అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు జి. చంద్రశేఖర్, వలిరెడ్డి శ్రీనివాసరావు, సీహెచ్ మంజుల, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సింథియా: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పలు పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.



నివాళులర్పిస్తున్న దళిత కుల పోరాట సమితి నాయకులు

- జీవీఎంసీ 62వ వార్డు ఎస్సార్‌కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబూరావు, డాక్టర్ చింతా ప్రభాకర్, జీవన్, పల్లారావు, పిలక రఘునాథరెడ్డి, కాలనీ గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 62వ వార్డు టీడీపీకాలనీ, ప్రకాషనగర్ తదితర ప్రాంతాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు మజ్జి మాలినాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నీలాపు జోగిబాబు తదితరులు నివాళులర్పించారు.
- జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ, మల్కాపురం ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడాల రాంబాబు, టి. కామేశ్వర రావు, కనకరాజు, శంకరరావు పాల్గొన్నారు.
- 63వ వార్డు కాకరలోవలో ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొటాన రవి, పునుకు రమణ, రాంబాబు, యలగాడ రాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మార్గదర్శకుడు అంబేడ్కర్

గోపాలపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మాధవధార రవాణా శాఖ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఉప రవాణా కమిషనర్ రాజారత్నం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మార్గదర్శకుడు అంబేడ్కర్ అడుగుజాడల్లో అందరూ నడవాలన్నారు. ఆర్‌టీవో ఆర్.సిహెచ్.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఆర్‌టీవో ఐ.వేణుగోపాలరావు, ఏవోలు ఐ.రఘుబాబు, జి.విమల, జి.కోటేశ్వరరావు, డి.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రమేష్



లక్ష్మీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బెహరా భాస్కరరావు

91వ వార్డులో..

లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. బండి దుర్గేష్, తెలుకల రమేష్, ఇ.శ్రీను, మరిడయ్య, గంగరాజు అనంత్, రాము పాల్గొన్నారు.

- 91వ వార్డు ఎస్సీ కాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి డాక్టర్ అంబేడ్కర్ సేవా సంఘం సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు కంచుమూర్తి సీతారాం, కార్యదర్శి పెంటయ్య, బి.మూర్తి, సూచిబాబు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

సింథియా: భారత ప్రభుత్వం స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్) ఆధ్వర్యంలో సీడాప్, ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న 21 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు బీఈ, బీటెక్ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు ప్రొడక్ట్ డిజైన్ ఇంజినీర్ – మెకానికల్ (30 సీట్లు) మోకాట్రానిక్స్ డిజైనర్ అండ్ సిస్టిమ్ ఇంటిగ్రేటేర్ ఇంజినీర్ కోర్సుల్లో 3 నుంచి 5 నెలల పాటు వసతి కల్పించి, ఉచిత శిక్షణ అందిస్తారు. అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీ కృష్ణ శివ్వం బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు విశాఖపట్నం సింథియా జంక్షన్‌లో ఉన్న సెమ్స్ కేంద్రంలో, 9948183865, 8500687750, 0891-2704010లో సంప్రదించి, డిసెంబర్ 15లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.